క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: భీమిలి మండలంలోని 11 కేవీ దాకమర్రి రూరల్ ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా టి.నగరపాలెం, కనకలపేట, మజ్జివలస, లక్ష్మీపురం, శింగనబంద, విజయరాంపురం, కృష్ణంరాజుపేట, మద్దిలపేట, నారాయణరాజుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పీఎం పాలెం పరిధిలో..

మధురవాడ: పీఎం పాలెంలోని సప్తగిరి ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ అప్పలనాయుడు తెలిపారు. ఈ కారణంగా సప్తగిరి కాలనీ, చాణక్యపురి లే అవుట్, పీర్‌లెస్ కాలనీ, తారకరామ నగర్, బింద్రానగర్, గుప్త లే అవుట్ పరిసర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కాశీవిశ్వనాథుని సన్నిధిలో చిన్నశ్రీను


కాశీ విశ్వనాథుని దర్శించుకుంటున్న మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కాశీ విశ్వనాథుని దర్శించుకున్నారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగ్‌రాజ్ కుంభమేళా పవిత్ర స్నానాలు ఆచరించారు.

ఎల్లమ్మతల్లి ఉత్సవాలకు శ్రీకారం


రాట ఉత్సవంలో పాల్గొన్న పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు

తగరపువలస: సంగివలస ఎల్లమ్మతల్లి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామ పూజారి ఉళ్ల అప్పారావు ఇంటి వద్ద గ్రామస్తుల సమక్షంలో ఉత్సవరాట వేశారు. మార్చి 6న ఎల్లమ్మతల్లికి దేవర ఉత్సవం, 7న అగ్నిగుండం, అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించనున్నారు. రాట మహోత్సవంలో తగరపువలస పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, గ్రామ పెద్దలు ఉళ్ల నరసింగరావు, నమ్మి అప్పలనాయుడు, సారిపల్లి మోహనరావు, కోల అప్పలకొండ, పీతల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


మానుకొండ లక్ష్మి (ఫైల్)


తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ సత్తరవు గ్రామానికి చెందిన మానుకొండ లక్ష్మి అనే మహిళ కనిపించడం లేదని ఆమె అక్క సాకూరి అరుణ ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలివి.. లక్ష్మి, అరుణ ఒకే ఇంట్లో నివాసం ఉంటూ, చిన్న చిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ నెల 5వ తేదీన లక్ష్మి పనికి అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. లక్ష్మి గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయి, 5 లేక 10 రోజుల తర్వాత తిరిగి వచ్చేదని, ఈ సారి అదేవిధంగా వస్తుందని ఎదురు చూశానని పేర్కొన్నారు. 20 రోజులు గడుస్తున్నా రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. సీఐ సి.హెచ్ వాసునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమిలిలో యువతి..

జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు గొల్లవీధికి చెందిన యువతి నక్కాన హేమ(21) మంగళవారం రాత్రి 7.45 సమయంలో ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి చంద్రకళ బుధవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమశ్శివాయ .. సాంబాయ శాంతాయ పరమాత్మనే..

స్థూల ప్రణవమైన పంచాక్షరిని పఠిస్తూ.. అంబ సమేతుడైన సాంబయ్యను మనసారా స్మరించారు భక్తులు. శాంత చిత్తులై పరమాత్మను భక్తితో అర్చించారు. మహాశివరాత్రి పర్వదిన వేళ అంతటా శివ నామస్మరణే ప్రతిధ్వనించింది. అభిషేక ప్రియుడికి నీరాజనాలు సమర్పించారు. మదినిండా మహాదేవుని నింపుకొని ఉపవాసాలు, జాగరణలు చేశారు.



మది నిండా మహాదేవుడే

అభిషేక ప్రియుడికి భక్తుల నీరాజనాలు

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

మధురవాడ: మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు భీమిలి నియోజకవర్గవాసులు. వేకువజాము నుంచి శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

- మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలోని అన్నపూర్ణా సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కీర్తన గోల్డ్ లోన్స్ నిర్వాహకులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.
- మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ మానం ఆంజనేయులు కాలనీలోని లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో 108 కుటుంబాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఎంవీపీ సిటీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ కపుల్స్ సంస్థ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక త్రైత రుద్ర పారాయణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఏవీ రావు తదితరులు పాల్గొన్నారు.
- మిథిలాపురి వుడా కాలనీ, ఆర్‌జీకే కాలనీ, వైఎస్సార్ కాలనీ, చంద్రంపాలెం తదితర ఆలయాల్లోనూ శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

చోడేశ్వరస్వామి ఆలయంలో..

భీమునిపట్నం: భీమిలిలోని చారిత్రక శివాలయంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఇక్కడి చోడేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అలాగే చంద్రశేఖర, భీమేశ్వర ఆలయాల్లోనూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యోగా కేంద్రం వద్ద నిర్వాహకులు సీహెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన రుద్రాభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైశాఖేశ్వరాలయంలో..

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ మంగళ గౌరీ సమేత వైశాఖేశ్వర దేవాలయంలో వైశాఖేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక రుద్రాభిషేకాలు, అఘోర పాశుపత రుద్ర హోమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నేతేటి చక్రధరశర్మ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రుషికొండలోని సప్తరుషీశ్వరాలయంలో ఏర్పాటు చేసిన పూజల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపల్లి గోపి, రాంబాబు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తితో రుద్రాభిషేకాలు

పద్మనాభం: కురపల్లిలోని చంద్రశేఖర రామలింగేశ్వరస్వామి, పద్మనాభం నారాయణేశ్వర స్వామి, గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పొట్నూరులోని ఉమా నీల కంఠేశ్వర స్వామి, అనంతవరంలోని దార కొండపై వెలసిన శ్రీమన్నారాయణేశ్వరస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కురపల్లిలోని చంద్రశేఖర రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అముజూరి అప్పారావు ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. వంద మందికి పైగా దంపతులు ఈ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి

తగరపువలస: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భీమిలి, ఆనందపురం మండలాల్లోని శివాలయాలు పంచాక్షరితో ప్రతిధ్వనించాయి. భక్తులు మహాదేవుని అభిషేకాలు, అర్చనల్లో పాల్గొన్నారు. పలు శివాలయాలలో ఉదయం, సాయంత్రం వేళల్లో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాలలో కాస్త విరామం కనిపించింది. పలువురు నది, సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. వివిధ ఆటంకాలతో సంక్రాంతి పండగ జరుపుకోలేనివారు శివరాత్రి వేళ పెద్దలకు బట్టలు, పిండివంటలు సమర్పించారు. వీరుబాబులు, పేరంటాళ్లకు ప్రత్యేక భజనా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.


సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు


చోడేశ్వరస్వామికి క్షీరాభిషేకం


కురపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న దంపతులు


విశేష అలంకరణలో స్వామి


వైశాఖేశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు


మహా కామేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు చేస్తున్న 108 కుటుంబాలు


యోగా కేంద్రంలో జరిగిన రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు


బసవపాలెంలో బసవేశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న శివయ్య

రుద్రాక్షల అలంకరణలో రాసపోలమాంబ



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని బుధవారం రుద్రాక్షలతో అలంకరించారు. నగరంలోని పూర్ణామార్కెట్‌కు చెందిన మహిళలు తుపాకుల రాము, తుపాకుల అప్పలనారాయణమ్మ, తుపాకుల అచ్చియ్యమ్మ, కాగితాల అచ్చియ్యమ్మ, తుపాకుల పార్వతి తదితరులు ఈ అలంకరణకు సహకారం అందించారు.

– తగరపువలస


టి.నగరపాలెం శివాలయం వద్ద భక్తులు


ప్రత్యేక అలంకరణలో గొల్లలపాలెంలో శివలింగం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

మధురవాడ: గురువారం జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విశాఖ రూరల్ పరిధిలో ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ పాల్‌కిరణ్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశాఖ రూరల్ మండలానికి సంబంధించిన 120 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కేంద్రాన్ని పీఎం పాలెం సీఐ బాలకృష్ణ పరిశీలించారు. ఇక్కడ 908మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు.

ఎగువపేట పాఠశాలలో..

భీమునిపట్నం: భీమిలిలోని ఎగువపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 250 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో 151మంది పురుషులు, 99మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను సీఐ బొడ్డేపల్లి సుధాకర్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. 14మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు.


చంద్రంపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ బాలకృష్ణ

తీరంలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద గురువారం పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం జోనల్ అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి మరుసటి రోజు పెద్ద సంఖ్యలో వచ్చి స్నానాలు ఆచరించే అవకాశం ఉన్నందున వారికి ఏ ఇబ్బందులు లేకుండా సన్నాహాలు చేశారు. తీరంలో నిర్ణయించిన ప్రాంతంలోనే స్నానాలు చేసే విధంగా రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు.


తీరంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

మహా కాళేశ్వరాలయంలో ఏకాదశ రుద్రాభిషేకాలు

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ మహాకాళేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఈవో నానాజీబాబు ఆధ్వర్యంలో అర్చకుడు పులపాల సంతోష్ ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణపతి పూజా పుణ్యాహవచనం మొదలుకుని గురువారం ఉదయం 5 గంటల వరకు 11 సార్లు ఏకాదశ రుద్రులకు రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. ప్రతి గంటకు ఒక సారి ఏకధాటిగా పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, చెరకు రసం, చితాభస్మం, గోమూత్రం, గోమయం, పండ్లరసాలు, శుద్ధజలంతో ఈ అభిషేకాలు నిర్వహిస్తారు.


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

పద్మనాభం: మండలంలోని రెండు శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పద్మనాభంలోని నారాయణేశ్వర స్వామి, గెద్దపేటలోని సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాల్లో ఈ కల్యాణం జరిపించారు. ముందుగా విశేష పూజలు చేశారు. అనంతరం పార్వతి పరమేశ్వరులకు శాంతి కల్యాణం నిర్వహించారు.


గెద్దపేట ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

రామ నామమే తారకమంత్రం

మధురవాడ: చనిపోతున్న వారిని కూడా బతికించగల మృత్యు సంజీవని శ్రీరామ నామమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎంత పెద్ద తప్పు చేసిన వారినైనా శరణాగతి చేస్తే శ్రీరాముడు కాపాడతాడన్నారు. మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా బుధవారం సుందర కాండలో మరో సిద్ధి సర్గగా పేర్కొనే సీతమ్మను హనుమ దర్శించడం, ఆమెకు హనుమ అభిజ్ఞానమును ఇచ్చిన ఘట్టముల గురించి వివరించారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- నడకదారిపై నిర్లక్ష్యం
- పలకలు లేక ఫుట్‌పాత్‌లు ప్రమాదకరం
- వాహనాల పార్కింగ్ అక్కడే..
- పాదచారులకు తప్పని అవస్థలు


పాత పీఎం పాలెం నుంచి సర్వీసు రోడ్డు మీదకు వచ్చే రోడ్డు మలుపులో కాంక్రీట్‌పలక లేక ఇలా..


ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ఉన్న పలకలు

పీఎం పాలెం: కారు షెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలి వైపు వెళ్లడానికి పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రమాదభరితంగా ఉన్నాయని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఆదమరిచామా.. అంతే..

జాతీయ రహదారికి రెండువైపులా పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. కల్వర్టులపై కాంక్రీటు పలకలను అమర్చి వాటినే ఫుట్‌పాత్‌గా మలిచారు. అంతవరకూ బాగానే ఉంది. అయితే, నిర్మాణ లోపం వలన తరచూ కాంక్రీట్ పలకలు శిథిలమవడం, మరలా నెలల తరబడి నత్తనడకగా పునర్నిర్మించడం..కొద్ది రోజుల్లో మళ్లీ శిథిలం కావడం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నడవడానికి వీలుగా ఉన్న ఫుట్‌పాత్ పట్టుమని పది గజాల దూరం కూడా ఉండదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆదమరచి నడిస్తే అంతే సంగతులు అన్నంత ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు దర్శనం ఇస్తున్నాయి. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను కొంతమంది వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై దృష్టి సారించాలని, శిథిలమైన కాంక్రీట్ పలకలను పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


కారుషెడ్ కూడలి నుంచి చంద్రంపాలెం వైపునకు వెళ్లే ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన కారు

చాలా ప్రమాదకరంగా ఉంది



ఫుట్‌పాత్‌లు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. చాలాచోట్ల పలకల్లేవు. రాత్రి సమయంలో ఆ ప్రాంతాన్ని గుర్తించేందుకు వీలుగా ఏదైనా ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులు గానీ, రేడియం పూసిన రాళ్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

– ఎం.రామారావు, పీఎం పాలెం

చిన్నపిల్లలతో ప్రయాణించాలంటే భయం



ఫుట్‌పాత్‌పై ప్రయాణించాలంటే ఎక్కడ ఏ గోతిలో పడిపోతామో అని ఆందోళన చెందుతున్నాం. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటే భయంగా ఉంటోంది. వృద్ధులతో ప్రయాణమన్నా హడలిపోతున్నాం. ఏమాత్రం గోతిలో పడినా అంతే సంగతులు.

– వి.వాణి, దుర్గానగర్

సురక్షితమైన నడకదారి నిర్మించాలి



సర్వీసు రోడ్డుపై సురక్షితమైన నడకదారి నిర్మించాలి. ప్రస్తుతం డ్రైనేజీపై ఫుట్‌పాత్ కోసం నిర్మిస్తున్న కాంక్రీట్ పలకలు శాశ్వతంగా ఉండేలా పనులు చేపట్టాలి. వృద్ధులు, మహిళలు ప్రయాణించడానికి వీలుగా రెయిలింగ్ నిర్మించాలి. రెయిలింగ్ నిర్మిస్తే ఫుట్ పాత్‌పై వాహనాల పార్కింగ్‌కు చెక్ పెట్టవచ్చు.

– పి.అరవింద్, కారుషెడ్ కూడలి, పిలకవానిపాలెం

మహాశివరాత్రి విశిష్టతపై ఇంటింటా ప్రచారం


చిల్లపేటలో ఇంటింటా ప్రచారంలో ప్రబోధసేవా సమితి సభ్యులు

తగరపువలస: మహాశివరాత్రి విశిష్టతపై విజయరాంపురం త్రైతసిద్ధాంత భగవద్గీత, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ రెండోవార్డు చిల్లపేట, జీరుపేట గ్రామాలలో త్రైతసిద్ధాంత అనుబంధ గ్రంథాల గురించి తెలియజేశారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ మాయ పట్ల జాగృతి కలిగిన శ్రద్ధగా శివరాత్రి జాగరణను చెప్పవచ్చన్నారు. శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు ఆత్మ, జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. త్రిగుణములు లేని స్థితిని రాత్రి అని, శి బీజాక్షరం అగ్నికి, వ బీజాక్షరం నీటికి గుర్తు అన్నారు. అగ్ని నీటిని దహించి ఆవిరి చేసినట్టే జ్ఞానాగ్ని కర్మను కాల్చి బూడిద చేస్తుందన్నారు. తద్వారా జీవుడు జన్మల నుంచి బయటపడి మోక్షం పొందుతాడన్నారు. శివరాత్రిని మోక్షరాత్రి అంటారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సభ్యులు అప్పలనాయుడు, వి.సురేష్, సూర్యనారాయణ, అచ్చియ్యమ్మ, లక్ష్మి, కె.రాజు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.